క్లుప్తంగా

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి



పొలాసలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

జగిత్యాలరూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. మండలంలోని పొలాస, తిమ్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వారి ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం, నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. చెత్తాచెదారం చెత్తబుట్టల్లోనే వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో గంగలక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు స్రవంతి, రాఘవేంద్ర పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డా.శ్రవణ్ కుమార్

వెల్గటూర్: ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రవణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు పరిసర ప్రజలకు శుక్రవారం అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమల ఆవాసానికి కారణమవుతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలోఏఎన్‌ఎం జయప్రద, సూపర్‌వైజర్ చంద్రలీల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ ప్రసాద్ ఆదేశించారు. మండలంలో అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని శుక్రవారం పరిశీలించారు. రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండకుండా తేమ శాతం వచ్చిన వడ్లను కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాలు పడే సూచనలు ఉన్నందున రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గంగాధర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



గోధూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

ఇబ్రహీంపట్నం: అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి డిమాండ్ చేశారు. మండలంలోని గోధూర్‌లో తడిసిన ధాన్యాన్ని శుక్రవారం పరిశీలించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సిబ్బంది చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



మాట్లాడుతున్న శ్రీకాంత్

సారంగాపూర్: తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని పీడీఎస్ టీవీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. శుక్రవారం సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం వెంట వెంటనే మిల్లులకు తరలించాలని, లారీలు అన్‌లోడ్ అయిన తరువాత తిరిగి కేంద్రాలకు చేరేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యంలో తరుగు లేకుండా చూడాలని కోరారు.

హైలెవల్ వంతెనకు మోక్షమెప్పుడో?

- అప్రోచ్ రోడ్డు పూర్తి చేస్తే రాకపోకలు
- త్వరగా ప్రారంభించాలంటున్న ప్రజలు
- వర్షాకాలమైతే ఇబ్బందులు..



కోనాపూర్ వాగుపై పూర్తయిన హైలెవల్ వంతెన

సారంగాపూర్: జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మీదుగా మంచిర్యాల జిల్లాలోని కలమడుగు వరకు జిల్లా కేంద్రం నుంచి రోజు వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో సారంగాపూర్ మండలం కోనాపూర్ వాగుపై 14 నెలల క్రితం ప్రభుత్వం రూ. 5.65 కోట్లతో హైలెవల్ వంతెన పనులు ప్రారంభించింది.

లోలెవల్ వంతెన తొలగించి..

వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వర్షపు నీరు, వరదలతో కోనాపూర్ వాగుపై వరద ఉధృతంగా ప్రవహించి జిల్లా కేంద్రం నుంచి మంచిర్యాల జిల్లా వైపు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతుండేవి. రోజుల తరబడి వరదలతో నీరు లోలెవల్ వంతెన పైనుంచి పారడంతో ప్రజలు జిల్లా కేంద్రానికి అత్యవసర పరిస్థితుల్లో వెళ్లడానికి పెద్ద వాహనాలను సైతం పోలీస్‌శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు అనుమతించే వారు కాదు.

హైలెవల్ వంతెనతో తొలగనున్న ఇబ్బందులు

14 నెలల క్రితం ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా వంతెన నిర్మాణానికి రూ. 5.65 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించారు. గడచిన వర్షాకాలంలో వర్షాలతో పనులకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం వంతెన పనులు దాదాపు పూర్తయ్యాయి. వంతెనకు ఇరువైపులా జగిత్యాల, సారంగాపూర్ వైపు 200 మీటర్ల చొప్పున అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

అడ్డంకిగా హైటెన్షన్ విద్యుత్ తీగలు

హైలెవల్ వంతెన ఎత్తుగా నిర్మాణం జరగడంతో వంతెనకు సమీపం నుంచి వెళ్లిన హైటెన్షన్ విద్యుత్ లైన్లు అప్రోచ్ రోడ్డుపై నుంచి భారీ వాహనాలు వెళ్లే సమయంలో వాహనాలకు విద్యుత్ తీగలు తగిలే ప్రమాదం ఉంది. దీనితో అప్రోచ్ రోడ్డు నిర్మాణం ఆగిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. హైటెన్షన్ విద్యుత్ లైన్లు తీగలు తగలకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం సంబంధిత శాఖ అనుమతులను ఆర్‌అండ్‌బీ శాఖ కోరింది.

మరో 15 రోజుల్లో వర్షాలు

మరో 15 రోజుల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉంది. వంతెనను పూర్తి చేయకపోతే ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారని, వెంటనే వంతెన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన ప్రారంభించాలి



వర్షాకాలం కంటే ముందే వంతెన పనులు పూర్తి చేసి వంతెనపై రాకపోకలు ప్రార ంభించాలి. వర్షాకాలంలో వరదలు వస్తే జగిత్యాలకు చేరుకోవడానికి ప్రస్తుతం ఉన్న 15 కిలోమీటర్లకు అదనంగా మరో 15 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది.

– జోగు లక్ష్మణ్, సారంగాపూర్

ఇబ్బందులు పడుతున్నాం



వర్షాకాలంలో అత్యవసర సమయాల్లో జగిత్యాల వెళ్లడానికి చాలా అవస్థలు పడుతున్నాం. ఆస్పత్రులు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే వారు, కూరగాయలు, పాలు జిల్లా కేంద్రానికి తీసుకెళ్లడానికి అవస్థలు పడుతున్నాం.

– బండారి వెంకటేశ్, పెంబట్ల

జూన్ 10 వరకు పూర్తి చేస్తాం



అప్రోచ్ రోడ్డు నిర్మాణం తరువాత వాహనాల మీద అతిసమీపంలో హైటెన్షన్ తీగలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయని, ఈ సమస్య ప్రస్తుతం తొలగిపోయింది.జూన్ 10 వరకు పనులు పూర్తి చేసి వంతెనపై రాకపోకలు ప్రారంభిస్తాం.

– రాజశేఖర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల ధర్నా



ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామ శివారుల్లోని కుంటల్లో పూడిక తీస్తుండగా రైతులు తమ పట్టా భూముల్లో తవ్వకాలు చేపడుతున్నారని అడ్డుకుంటున్నారని, దీంతో తాము పనులు చేయలేక పోతున్నామని పేర్కొన్నారు. వారం క్రితం నర్సింహుల కుంటలో తవ్వకాలు చేపడితే ఓ రైతు అడ్డుకుని తన పట్టా భూమిలో తీయొద్దని అభ్యంతరం చెప్పాడని, మళ్లీ బూర్గుల కుంటలో తవ్వకాలు చేపడితే రైతులు పట్టా భూములున్నాయని, అడ్డుకున్నారని కలిగిస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు వచ్చి తమకు హద్దులు చూపించాలని ఆందోళన చేపట్టారు. దీంతో తహసీల్దార్ కిషన్ సర్వేయర్ కుమారస్వామి, ఆర్‌ఐ రాజేందర్‌రావులను బూర్గుల కుంటలోకి పంపి హద్దులు ఏర్పాటు చేయటంతో కూలీలు యథావిధిగా పనులు కొనసాగించారు.

గ్రంథాలయానికి రూ.25 వేలు అందజేత

ధర్మపురి: పట్టణంలోని గ్రంథాలయంలో వసతుల కల్పనకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో రూ. 25 వేలు అందించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు సరైన వసతులు లేవని ప్రభుత్వ విప్‌కు విన్నవించగా, స్పందించి ఫర్నీచర్ కోసం రూ.25 వేలు కాంగ్రెస్ నాయకుల ద్వారా నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల బడిబాట ర్యాలీ



అడ్మిషన్ తీసుకుంటున్న ఎంఈవో,ఉపాధ్యాయులు

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లి, కథలాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను ఉపాధ్యాయులు వివరించారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించామని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. పలువురి విద్యార్థుల కొత్త అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం అర్జున్, ఉపాధ్యాయులు వెంకటేశం, శశిధర్, కృష్ణారావు, దరందీప్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేస్తున్నందుకు ధర్నాలా?



మాట్లాడుతున్న వాకిటి సత్యంరెడ్డి

మల్లాపూర్: రైతులకు ఏ ప్రభుత్వం చేయనివిధంగా ఏకకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నందుకా.. బీఆర్‌ఎస్ ధర్నాలు అని కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్యంపేటలో శుక్రవారం మాట్లాడారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ రైతులకు చేసిందేమిలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు చేస్తున్న రైతులకు సంకెళ్లు వేసిన బీఆర్‌ఎస్ పార్టీ చరిత్రను రైతులే వరూ మర్చిపోరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు హామీలన్నింటిని అమలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 12 స్థానాలను దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జడ్జి పావని

కోరుట్ల రూరల్: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మెట్‌పల్లి న్యాయ విజ్ఞాన సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పావని చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు,న్యాయవాదులు రాజశేఖర్, చాప కిషోర్, సదాశివరాజు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థులకు పతకాలు





ట్రోఫీలతో గంగంరెడ్డి, కొండ్ర సుమిత్‌రెడ్డి

గొల్లపల్లి: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గంగంరెడ్డి, వెంగలాపూర్‌కు చెందిన కొండ్ర సుమిత్‌రెడ్డి అంతర్జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో పతకాలు సాధించారు. జగిత్యాలలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గంగంరెడ్డి, కొండ్ర సుమిత్‌రెడ్డి నేపాల్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ యూత్ గేమ్స్ చాంపియన్‌షిప్ 2024లో భారత్ తరఫున పాల్గొని ఫైనల్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించారు. వీరిని తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ రమేశ్, వెంగలాపూర్ మాజీ సర్పంచ్ అనిత, మాజీ సర్పంచ్ కిషన్ అభినందించారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీపీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్‌లో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను శుక్రవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి సన్మానించి, అభినందించారు. గోధూర్ హైస్కూల్ విద్యార్థిని కూన శృతి 9.8, ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్ విద్యార్థిని గొండ హరిణి 9.5 , వొద్దె నివేద 9.5 జీపీఏ సాధించి మండల టాపర్లుగా నిలిచారు. వీరు ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొటగిరి వెంకటస్వామి,మాజీ సర్పంచులు గోధూర్ మురళి, వేముల లింగారెడ్డి, ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శలో ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

పెగడపల్లి: తెలంగాణ ఆదర్శ మోడల్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని పెగడపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో 40 సీట్ల చొప్పున ఉన్నాయని పదో తరగతి ఉత్తీర్ణులయిన ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవల ఆలస్యంపై ఫిర్యాదు

కోరుట్లరూరల్: ఆర్టీసీ కార్గో ద్వారా హైదరాబాద్ నుంచి ఫ్రూట్స్ పార్సిల్ చేస్తే ఆలస్యంగా చేరాయని పట్టణానికి చెందిన ముజమిల్ శనివారం రాత్రి కోరుట్ల బస్టాండ్ కార్గో కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 15న హైదరాబాద్ నుంచి కోరుట్లకు కార్గో ద్వారా ఫ్రూట్స్ పార్సిల్ చేయగా శుక్రవారం చేరాయని మూడు రోజుల సమయం పట్టడంతో ఫ్రూట్స్ పూర్తిగా కుళ్లిపోయి నష్ట పోయానని బాధితుడు పేర్కొన్నాడు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస శ్రీ సహస్ర లింగాల ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన భక్తులు శివకల్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నలమాసు గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: తమ గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని మెట్‌పల్లి మండలం రాంచంద్రంపేట గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా రేషన్ దుకాణం లేకపోవడంతో వెల్లుల్లలోని రేషన్ దుకాణం నుంచి బియ్యం తీసుకుంటున్నామని,2 కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని తమ గోడు వెళ్లబోసుకున్నారు. మహిళలు,వృద్ధులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే రేషన్ దుకాణం ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్,రంజిత్,అనిల్,గణేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో ఇక్కట్లు



మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వర్షపు నీరు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్షపు నీరు నిలవడంతో కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో కార్యాలయం ఆరుబయట నీరు నిలిచింది. దీంతో శుక్రవారం ఉద్యోగులు, సిబ్బందితో పాటు పలు పనులపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు తంటాలు పడ్డారు. చుట్టూ ఇసుక కుప్పలు ఉండడంతో వర్షపు నీరు అక్కడే నిలుస్తోంది.

సంక్షిప్త వార్తలు

ఆర్టీసీ బస్సు.. లారీ ఢీ

వెల్గటూర్: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటనలో ప్రయాణికులకు స్వల్ప గాయాలైనాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి మంచిర్యాలకు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా.. ఎండపల్లి మండలం కొత్తపేట శివారు వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ముందున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి బస్సును చివరి భాగంలో ఢీకొట్టింది. ఘటన సమయంలో బస్సులో సుమారు 90 మంది ప్రయాణికులున్నట్లు కండక్టర్ తెలిపారు. ఎదురెదురుగా బస్సు, లారీ ఢీకొంటే పెద్ద ప్రమాదం జరిగేదని, అదృష్టవశాత్తు ఏమీ కాలేదని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

గుండెపోటుతో ప్రైవేట్ ఉపాధ్యాయుడు మృతి

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన సంక రాజేందర్(55) అనే ప్రైవేట్ ఉపాధ్యాయుడు గుండెపోటుతో శుక్రవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రాజేందర్ మండలంలోని కథలాపూర్, సిరికొండ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిగా, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడిగా 35 ఏళ్లుగా సేవలందించారు. అనారోగ్యానికి గురికావడంతో గురువారం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. చికిత్సపొందుతున్న క్రమంలో గుండెపోటుకు గురికావడంతో శుక్రవారం మృతిచెందాడు. రాజేందర్ మృతిపై మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి భార్య సంక మాధురి రెండు పర్యాయాలు సిరికొండ సర్పంచ్‌గా సేవలదించారు.

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా రాజేశ్

జగిత్యాలరూరల్: మండలంలోని లక్ష్మీపూర్ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూపల్లి రాజేశ్, ఉపాధ్యక్షుడిగా గుండ బాలయ్య, కార్యదర్శిగా గుండ రమేశ్, కోశాధికారిగా దాసరి ఇస్మాయిల్, జాయింట్ సెక్రటరీగా పూదరి బుచ్చన్న, కార్యవర్గ సభ్యులుగా లక్కం గట్టయ్య, చెరుకు కాంతయ్య, గుండ రాజన్నను ఎన్నుకున్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

మల్లాపూర్: టీచర్ల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) మండల అధ్యక్షుడు ఎగ్యారపు వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. టెట్‌తో నిమిత్తం లేకుండా హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. గతంలో ట్రాన్స్‌ఫర్ అయిన టీచర్లను రిలీవ్ చేయాలన్నారు. టెట్‌పై సరైన సమాచారం ఇవ్వకుండా గందరగోళం చేసిన విద్యాశాఖ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ మండల బాధ్యులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ చైర్మన్‌కు ప్రతిపాదనలు అందజేత

కోరుట్ల రూరల్: తెలంగాణ వేతన సవరణ చర్చలో భాగంగా శుక్రవారం పీఆర్‌టీయూ నాయకులు నూతన ప్రతిపాదనలను పీఆర్‌సీ చైర్మన్ ఎన్. శివ శంకర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ప్రతిపాదనల ప్రతులను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్దన్ రెడ్డి, అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: మండలంలోని లక్ష్మీపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ తెలిపారు.

ధరూర్‌క్యాంప్‌లో...

టౌన్–3 పరిధిలోని భవానినగర్, ఎమ్మెల్యే క్వార్టర్స్, కలెక్టర్ రెసిడెన్సీ, కరీంనగర్ రోడ్, రామాలయం ఏరియా, ధరూర్ క్యాంపు, చర్చి ఏరియా, అయ్యప్ప కాలనీ, బుడగజంగాల కాలనీ, పద్మనాయక బ్యాంక్, హైటెక్ కాలనీ, శాంతి నగర్ , అంతర్గాం రోడ్,గణేష్ నగర్, వినాయక నగర్ ఏరియాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ రహీం తెలిపారు.

మల్యాల: మండలంలోని పోతారం, రాజారం గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని రామన్నపేట సెక్షన్ విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి, నాగులపేట, మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ భూక్యా శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా గంగమ్మతల్లి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, భక్తులు

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గంగమ్మతల్లికి ఘనంగా బోనాలు చేశారు. మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో గంగ–శివుని కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు చెరుకు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రజనికుమార్, హరీశ్‌కుమార్, చంద్రప్రకాశ్, మల్లయ్య, సూర్యప్రకాశ్, నరేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ బోనాలు

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో శుక్రవారం దుర్గమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

కొనసాగుతున్న బీరప్ప ఉత్సవాలు

పెగడపల్లి: మండలంలోని రాజరాంపల్లి, మద్దులపల్లి గ్రామాల్లో కుర్మ, యాదవులు నాలుగు రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో బీరయ్య ఉత్సవాలు జరుపుకుంటున్నారు. మొదటి రోజు పోచమ్మకు గొర్రెలతో గావు పట్టి రక్త తర్పణం, రెండో రోజు పాలు,నెయ్యితో అభిషేకం, మూడోరోజు రేవు బోనం నిర్వహించారు. శుక్రవారం నాగెల్లి పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. బీరయ్య ఉత్సవాల సందర్భంగా బంధువుల రాకతో కుర్మ, యాదవుల ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది.